# సాక్షి సంగారెడ్డి

మంగళవారం । 30 । సెప్టెంబర్ । 2025


సంగారెడ్డి మండలంలోని పసల్వాది గ్రామంలో బతుకమ్మ వేడుకలు



## ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

సంగారెడ్డి టౌన్: బతుకమ్మ వేడుకలను సంగారెడ్డి మండలంలో ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల పూలతో బతుకమ్మలను భక్తిశ్రద్ధలతో పేర్చారు. మహిళలంతా ఒక చోట చేరి ఆడి పాడారు. పసల్వాది గ్రామంలో పట్నం మాణిక్యం నిర్మలాదేవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహిళలు కోలాటాలు వేస్తూ ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. సంగారెడ్డి రామ్మందిరిలో పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆయన కుటుంబస భ్యులు మహిళలతో కలసి బతుకమ్మ ఆడారు.



బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న జగ్గారెడ్డి దంపతులు



సంగారెడ్డి చెరువు కట్టపై బతుకమ్మ ఆడుతున్న మహిళలు

## న్యూస్‌రీల్

### అంతరాష్ట్ర భజన పోటీల విజేత ఉద్గీర్



విజేతగా నిలిచిన ఉద్గీర్ భజన మండలిని అభినందిస్తున్న నిర్వాహకులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని భవానీ మందిరంలో నిర్వహించిన అంతరాష్ట్ర భజన పోటీల్లో ఉద్గీర్ భజన మండలి విజేతగా నిలిచింది. సోమవారం రాత్రి జరిగిన ఫైనల్ పోటీలు ఉత్కంట భరితంగా కొనసాగాయి. మహారాష్ట్రలోని ఉద్గీర్ సూర్‌రాజ్ భజన మండలి విజేతగా నిలిచి మొదటి బహుమతి గెలుచుకుంది. భజన మండలికి రూ.50 వేల నగదును నిర్వాహకులు అందజేశారు. ద్వితీయ బహుమతిని గద్వాల్ భజన మండలి గెలుచుకుంది. సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, మాజీ ఎంపీ.బీబీపాటిల్, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ ఉజ్వల్‌రెడ్డిలు విజేతలకు నగదు బహుమతి అందజేశారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా బెంగళూరుకు చెందిన సంగీత విద్వాంసులు చింతామణి విశ్వనాథం, జహీరాబాద్‌కు చెందిన శంకర్‌జోషిలు వ్యవహరించారు.

### పోలింగ్ స్టేషన్లను సందర్శించాలి

**జిల్లా ఎస్పీ పరితోశ్ పంకజ్**

సంగారెడ్డి జోన్: జిల్లాలోని ప్రతీ పోలింగ్ స్టేషను సంబంధిత అధికారులు సందర్శించాలని జిల్లా ఎస్పీ పరితోశ్ పంకజ్ ఆదేశించారు. ఎన్నికల నిర్వహణపై పోలీసు అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...రాష్ట్ర సరిహద్దులలో అక్రమ రవాణా జరగకుండా గట్టి నిఘా ఏర్పాటు చేయాలన్నారు.

**ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి**

ప్రతిరోజు వ్యాయామం చేస్తూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జిల్లా ఎస్పీ సూచించారు. వరల్డ్ హార్ట్ డేను పురస్కరించుకుని ఓ ప్రైవేటు ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన సైకిల్ ర్యాలీలో ఎస్పీతోపాటు అధికారులు పాల్గొన్నారు.

### 11 నుంచి ఇర్ఫానీ దర్గా ఉత్సవాలు

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి పట్టణ శివారులోని ఇర్ఫానీ దర్గా 23వ ఉర్సు ఉత్సవాలు అక్టోబరు 11 నుంచి రెండురోజుల పాటు జరుగనున్నాయని పీఠాధిపతి హజ్రత్ హకీమ్ ఒమర్ బిన్ అహ్మద్ సజ్జద్ యే నషీన్ బార్గ ఇర్ఫానీ తెలిపారు. ఈ ఉత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు హాజరై మొక్కులు తీర్చుకుంటారని తెలిపారు.

### పిరామల్ ప్లాంట్ ఏర్పాటును విరమించుకోవాలి

**ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నరోత్తం**

జహీరాబాద్: కోహీర్ మండలంలోని దిగ్వాల్ గ్రామంలో పిరామల్ కర్మాగారం యాజమాన్యం ప్రస్తుత ప్లాంట్‌కు అనుబంధంగా కొత్త ప్లాంట్ ఏర్పాటు చేసే ప్రయత్నాలను విరమించుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై.నరోత్తం పత్రికా ప్రకటనలో కోరారు. అటవీ ప్రాంతంలో పెట్టాల్సిన కెమికల్ కర్మాగారాన్ని జనం నివసించే ప్రాంతంలో పెట్టడం తగదన్నారు. ఇప్పటికే కార్మాగారం నుంచి వెలువడుతున్న జల, వాయు కాలుష్యం కారణంగా ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## సరస్వతీదేవిగా అమ్మవారు



దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 8వ రోజు సోమవారం అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని నవపాన్ సమీపంలో ఉన్న శ్రీ రేణుక ఎల్లమ్మ వారు, ఎంజీ రోడ్డులోని మహంకాళి దేవాలయంలో అమ్మవారు, టోల్‌గేట్ సమీపంలోని శ్రీ రామ లింగేశ్వర దేవస్థానంలో అమ్మవారు భక్తులకు చదువుల తల్లి సరస్వతి దేవిగా దర్శమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు కుంకుమార్చన, నిర్వహించారు. అనంతరం చిన్నారులకు పుస్తకాలను పలకలు అందజేశారు. - పటాన్‌చెరు టౌన్

# స్థానిక కోడ్ కూసింది

- ఎన్నికల షెడ్యూల్ విడుదల
- పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్‌లకు ఎన్నికలు
- పోటీకి సిద్ధమవుతున్న రిజర్వేషన్లు కలిసొచ్చిన నేతలు
- ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జిల వద్దకు పరుగులు
- మద్దతు కూడగట్టే ప్రయత్నాల్లో ఆశావహులు
- అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించనున్న ప్రధాన పార్టీలు



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: పల్లెల్లో స్థానిక సంస్థల ఎన్నికల వేడి రాజుకుంది. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి షెడ్యుల్ రావడంతో గ్రామాల్లో రాజకీయ సందడి నెలకొంది. రిజర్వేషన్లు అనుకూలంగా వచ్చిన నాయకులు ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. సర్పంచ్ ఎన్నికలు పార్టీ రహితంగా జరుగుతుండగా, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు మాత్రం రాజకీయ పార్టీల గుర్తులతో ఎన్నికలు నిర్వహిస్తారు. దీంతో బరిలోకి దిగాలని భావిస్తున్న నేతలు ఈ టికెట్ల కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. ఆయా పార్టీల ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, పార్టీ కీలక నేతల వద్దకు వెళ్లి టికెట్ కోసం విజ్ఞప్తి చేస్తున్నారు. ఎన్నికల్లో పోటీ చేసే ఆసక్తి చూపుతున్న నాయకులు దసరా పండుగల సందర్భంగా విందులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటి నుంచే గ్రామాల్లో మద్దతు కూడగట్టే ప్రయత్నాలు ప్రారంభించారు.

**రెండు విడతల్లో...**

సర్పంచులతోపాటు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు కావడంతో వీటికి ఎన్నికల నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సోమవారం షెడ్యూల్‌ను ప్రకటించింది. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను రెండు విడతల్లో చేపట్టాలని నిర్ణయించినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని ప్రకటించారు. అలాగే సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించాలని నిర్ణయించారు.

**జిల్లాలో స్థానిక సంస్థల ప్రజాపతినిధుల స్థానాలివి**

| | |
|---|---|
| మొత్తం సర్పంచుల స్థానాలు (గ్రామపంచాయతీలు): | 613 |
| మొత్తం వార్డు సభ్యుల సంఖ్య: | 5,370 |
| మొత్తం మండలాలు (జెడ్పీటీసీల సంఖ్య): | 25 |
| ఎంపీటీసీల సంఖ్య: | 261 |
| ఎంపీపీలు: | 25 |

| | |
|---|---|
| మొత్తం ఓటర్లు: | 7,44,157 |
| మహిళలు: | 3,75,855 |
| పురుషులు: | 3,68,258 |
| ఇతరులు: | 44 |

### అభ్యర్థుల ఎంపికపై పార్టీల నజర్

స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కావడంతో ప్రధాన పార్టీల అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించనున్నాయి. తొలుత జెడ్పీటీసీ అభ్యర్థులు, ఎంపీపీ అభ్యర్థుల ఎంపిక విషయంలో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, పార్టీల ఇన్‌చార్జిలు కీలకంగా వ్యవహరించనున్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ అభ్యర్థి విషయంలో పార్టీ రాష్ట్ర నాయకత్వాలతో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. అయితే సోమవారం సద్దుల బతుకమ్మ, అక్టోబర్ 2న దసరా ఉండటంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు పండగల బిజీల్లో ఉన్నారు. ఈ పండగల తర్వాత ఈ ఎన్నికల వేడి మరింత రాజుకోనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**కోర్టు తీర్పు నేపథ్యంలో..**

ఈ ఎన్నికలకు నోటిఫికేషన్ అక్టోబర్ 9న విడుదల చేయనున్నారు. ఆరోజు నుంచే నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుంది. అయితే స్థానిక సంస్థల రిజర్వేషన్ల విషయంలో కోర్టు తీర్పు ఈ నెల 8న విచారణ జరగనుంది. ఈ నేపథ్యంలో కోర్టు తీర్పు మేరకు ఎన్నికలు నిర్వహణ ముందుకు సాగే అవకాశాలున్నాయి. దీంతో పోటీ చేయాలని భావించిన నాయకులు సంశయంలో ఉన్నారు. తీరా ఒకవేళ ఎన్నికలు వాయిదా పడితే ఇప్పటి నుంచి పెట్టిన వ్యయం వృథా అవుతుందేమోననే ధోరణితో నాయకులు ఉన్నారు.

**అమలులోకి ఎన్నికల కోడ్..**

స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో జిల్లాలో ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చింది. ఈ ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించేందుకు వీలు ఉండదు. అలాగే రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, నాయకులు ఎన్నికల నియమావళిని పాటించాలని ఎన్నికల సంఘం ప్రకటించింది.

## పంచాయతీ రిజర్వేషన్లు ఖరారు

- సర్పంచులు 613.. వార్డు సభ్యులు 5,370
- కొత్తగా 11 గ్రామపంచాయతీలు ఏర్పాటు
- గతంలో కంటే తగ్గిన జీపీ, వార్డులు



సంగారెడ్డి జోన్: జిల్లాలో పంచాయతీ రిజర్వేషన్లు ఖరారయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 42% బీసీలకు కేటాయిస్తూ గతంలో ఉన్న రిజర్వులకు పూర్తిగా భిన్నంగా రొటేషన్ పద్ధతిలో కేటాయించారు. ఎన్నికల నిర్వహణ లో భాగంగా గ్రామ పంచాయతీల వారీగా సర్పంచ్‌తోపాటు వార్డు సభ్యుడి స్థానాల జాబితాను విడుదల చేశారు.

**జిల్లాలో 613 జీపీలు.... 5,370 వార్డులు**

జిల్లా వ్యాప్తంగా 613 గ్రామపంచాయతీలు ఉన్నాయి. వాటి పరిధిలో 5,370 వార్డులున్నాయి. ఇందులో 81 గ్రామ పంచాయతీలలో 100% ఎస్టీ జనాభా ఉంది. ఆయా గ్రామ పంచాయతీలను పూర్తిగా ఎస్టీలకే రిజర్వ్ చేశారు. మరో 18 గ్రామ పంచాయతీలలో ఎస్టీ జనాభా ఉండటంతో వాటిని సైతం ఎస్టీలకే కేటాయించారు.

**తగ్గిన గ్రామపంచాయతీలు, వార్డులు**

గత పంచాయతీ ఎన్నికల్లో జిల్లాలో 647 జీపీలు ఉండగా 5,778 వార్డులకు ఎన్నిక జరిగింది. అయితే జిల్లాలో 11 కొత్త గ్రామపంచాయతీలు ఏర్పడ్డాయి. 45 గ్రామపంచాయతీలు సమీప మునిసిపాలిటీలలో విలీనం కాగా మరికొన్ని కొత్త మున్సిపాలిటీలు ఏర్పడ్డాయి. ఇందులో పటాన్‌చెరు నియోజకవర్గంలో ఎక్కువ పంచాయతీలు విలీనమయ్యాయి. దీంతో గతంలో కంటే ప్రస్తుతం 34 పంచాయతీ, 408 వార్డుల స్థానాల సంఖ్య తగ్గింది.

**జిల్లాలో పంచాయతి రిజర్వేషన్ల వివరాలిలా**

| | |
|---|---|
| జిల్లా మొత్తం గ్రామపంచాయతీలు | 613 |
| 100% ఎస్టీ జనరల్ | 43 |
| 100% ఎస్టీ మహిళ | 38 |
| సాధారణ ఎస్టీ జనరల్ | 11 |
| సాధారణ ఎస్టీ మహిళ | 7 |
| ఎస్సీ జనరల్ | 65 |
| ఎస్సీ మహిళ | 61 |
| బీసీ జనరల్ | 113 |
| బీసీ మహిళ | 111 |
| అన్ రిజర్వుడ్ జనరల్ | 83 |
| అన్ రిజర్వుడ్ మహిళ | 81 |

**జిల్లాలో వార్డు రిజర్వేషన్లు వివరాలిలా**

| | |
|---|---|
| జిల్లాలో మొత్తం వార్డులు | 5,370 |
| 100% ఎస్టీ జనరల్ | 298 |
| 100% ఎస్టీ మహిళ | 298 |
| సాధారణ ఎస్టీ జనరల్ | 70 |
| సాధారణ ఎస్టీ మహిళ | 86 |
| ఎస్సీ జనరల్ | 563 |
| ఎస్సీ మహిళ | 560 |
| బీసీ జనరల్ | 1,076 |
| బీసీ మహిళ | 1,107 |
| అన్ రిజర్వుడ్ జనరల్ | 678 |
| అన్ రిజర్వ్ మహిళ | 634 |

**జిల్లాలోని ఓటర్ల వివరాలు**

| నియోజకవర్గం | స్త్రీలు | పురుషులు | ఇతరులు |
|---|---|---|---|
| అందోల్ | 84,548 | 81,382 | 3 |
| నారాయణఖేడ్ | 94,347 | 95,108 | 7 |
| నర్సాపూర్ | 22,051 | 20,841 | 2 |
| పటాన్‌చెరు | 11,227 | 10,805 | 2 |
| సంగారెడ్డి | 68,358 | 65,355 | 28 |
| జహీరాబాద్ | 95,324 | 94,767 | 2 |

## పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ

**కలెక్టర్ ప్రావీణ్య**

సంగారెడ్డి జోన్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో ఎన్నికల నిర్వహణపై సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాళ్లలో తగిన వసతులు కల్పించాలన్నారు. స్థానిక ఎన్నికల సమాచారం తెలుసుకునేందుకు జిల్లా పరిషత్తు కార్యాలయంలో హెల్ప్ లైన్ 81253 52721 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా పరిషత్ సీఈవో జానకీరెడ్డి పాల్గొన్నారు.

**పల్స్ పోలియో విజయవంతం చేయాలి**

అక్టోబర్ 12 నుంచి 14 వరకు నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేయాలని ఆరోగ్యశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ ఆదేశించారు. ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు.

## కూరగాయాలు

- వర్షాలకు దెబ్బతిన్న పంటలు
- వెంటాడుతున్న తెగుళ్ల బెడద
- వరుసగా నష్టాలు..ఆందోళనలో రైతులు



బూచినెల్లి పరిధిలో దెబ్బతిన్న బెండపంట

జహీరాబాద్ టౌన్: కొంత కాలంగా ఎడతెగకుండా కురుస్తున్న వర్షాల ప్రభావం కూరగాయ పంటలపై తీవ్రంగా పడింది. వానలకు పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. పంట పొలాల్లో నీరు నిలువ ఉండటంతో కూరగాయలు రాలిపోవడం, ఆకుకూరలు తడిసి మురిగిపోయాయి. తాజాగా కురుస్తున్న వాన వల్ల పంటలకు తెగుళ్లు వెంటాడుతుంది. ఏ పంటలకు ఏ మందులు వేయాలోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

**ఎనిమిది వేల ఎకరాలకు పైగా సాగు..**

ఈ ఏడాది వర్షాలు ఆలస్యంగా కురవడంతో సాగు నీటి కొరత వల్ల కూరగాయల సాగు ఆలస్యంగా మొదలైంది. కొంతమంది రైతులు జూన్, జూలై నెలల్లోనే పంటలు వేశారు. జిల్లాలో సుమారు 8 వేల ఎకరాలకు పైగా కూరగాయ పంటలు సాగవుతున్నాయి. జిల్లాలో భారీ ఎత్తున వానలు కురవడంతో పంటలు దెబ్బతిన్నాయి. వారం రోజుల నుంచి ముసురుతో నేలలు బురదగా మారడం వల్ల రైతులు తోటల వద్దకు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. టమాటా,బెండ,బీర,దొండ, వంకాయ వంటి వాటిని కోయడం, మోసుకురావడం, వాటిని మార్కెట్‌కు తరలించడం ఇబ్బందిగా మారింది.



వర్షాలకు రాలిపోయిన టమాటా

అత్యధిక వినియోగం ఉండే టమాటాకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఇప్పటికే కూరగాయల రకాన్ని బట్టి రైతులు ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చు చేశారు. వర్షాల వల్ల వివిధ రకాల తెగుళ్ల సోకడంతో రైతులు సస్యరక్షణ పనులు ముమ్మరం చేశారు. సూచనలు, సలహాలు ఇచ్చేవారు లేక దెబ్బతిన్న పంటలకు ఏ మందులు వేయాలో తెలియడం లేదని వాపోతున్నారు. వర్షాలకు పంటలు దెబ్బతిన్న కారణంగా మార్కెట్‌లో డిమాండ్ ఏర్పడి ధరలు పెరిగాయి.

**వర్షాలతో కష్ట నష్టాలు**

రెండు నెలల నుంచి ఎడతెగని వర్షాలతో కూరగాయలకు తీవ్ర నష్టం వాటిల్లింది. సగం ఎకరం బెండ తోటలో వారానికి సుమారు వంద కిలోల దిగుబడి రావాలి. ప్రస్తుతం 30 కిలోలు కూడా రావడంలేదు. మిగతా కూరగాయల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. వర్షాలు ఆగితేనే ఇప్పుడున్న పంట దక్కుతుంది. ఉద్యాన శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించి దెబ్బతిన్న పంటలకు పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలి.

-వెంకట్,రైతు, బూచినెల్లి

## ప్రవేశాలు ఫుల్.. వసతులు నిల్

- హత్నూర ఐటీఐలో అన్నీ సమస్యలే
- శిథిలావస్థకు చేరిన భవనం
- విద్యుత్ సమస్యతో ట్రేడ్లలో పనిచేయని మెషీన్లు
- తాగునీరు, మరుగుదొడ్లు లేక విద్యార్థుల తిప్పలు



శిథిలావస్థలో ఉన్న హత్నూర ఐటీఐ భవనం

హత్నూర( సంగారెడ్డి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఐటీఐలను బలోపేతం చేసేందుకు చుట్టినప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం ఇంకా సమస్యలు పరిష్కారం కావడం లేదు. ఒకప్పుడు హత్నూర ఐటీఐ అంటే జిల్లాలోనే ఎంతో గుర్తింపు పొందింది. ప్రస్తుతం విద్యార్థులు అడ్మిషన్లు పూర్తిస్థాయిలో నిండాయి కానీ వస్తువులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దశాబ్దాల క్రితం నిర్మించిన హత్నూర ఐటీఐ భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. అయినా అధికారులు కానీ ప్రభుత్వం కానీ పట్టించుకోవడం లేదు.ఐటీఐలో విద్యార్థుల అడ్మిషన్ల పూర్తిస్థాయిలో నిండాయి. విద్యార్థుల సంఖ్యకు తగినట్లుగా వస్తువులు లేకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**శిక్షణ పొందుతున్న 480 మంది విద్యార్థులు**

ఎలక్ట్రిషన్, మోటర్ మెకానిక్ వెహికల్, వెల్డర్, టర్నర్, ఫిట్టర్, కోప, ఇన్సిస్ట్ గ్రైండర్, మెషీనిస్ట్ కాంపోజిట్ 8 విభాగాల్లో ప్రస్తుతం 480 మంది విద్యార్థులు ఇక్కడ శిక్షణ పొందుతున్నారు. వీరికి ఆరుగురు ఇన్‌స్ట్రక్టర్లు మాత్రమే శిక్షణనిస్తున్నారు. ఇంకో నలుగురు ఇన్‌స్ట్రక్టర్ల అవసరం ఉంది.

**కరెంటు రాక ఆగిన ప్రయోగాలు**

దశాబ్దాల క్రితం నిర్మించిన భవనం పూర్తిగా శిథిలవస్థకు చేరి ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. విద్యార్థులకు శిక్షణ ఇచ్చే ట్రేడ్లు భవనాలు పైకప్పు రేకులు పూర్తిగా పాడైపోయి రంధ్రాలు పడ్డాయి. కొన్ని నెలలుగా విద్యుత్ సరఫరా కొన్ని ట్రేడ్లలోకి రాకపోవడంతో మెషీన్లు నడిపించలేక విద్యార్థులతో ప్రయోగాలు చేయించడం లేదు. కనీసం విద్యార్థులకు తాగేందుకు నీళ్లు కూడా లేవు. మూత్రశాలలు మరుగుదొడ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు, సిబ్బంది నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారు. సిబ్బంది కోసం కట్టిన క్వార్టర్లు, హాస్టల్ భవనం సైతం కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయి.



ఐటీఐ ట్రేడ్లలో విద్యుత్ సరఫరా లేక అలంకారప్రాయంగా ఉన్న మెషీన్లు

**రా మెటీరియల్ కరువు.**

ఐటీఐలో విద్యార్థులకు ప్రాక్టికల్స్ (ప్రయోగాలు) చేయించేందుకు ప్రభుత్వం రా మెటీరియల్ సరఫరా చేయకపోవడంతో కొన్ని నెలలుగా విద్యార్థులతో ప్రయోగాలు చేయించడంలేదు. ప్రస్తుతం థియరీ మాత్రమే బోధిస్తున్నారు.

**వసతులు కరువు.**



ఐటీఐలో చదువుకోవడానికి వసతుల్లేవు. ప్రయోగాలు చేసేందుకు రా మెటీరియల్ లేదు. ట్రేడ్ షెడ్ భవనాల పై కప్పులు రంధ్రాలు పడ్డాయి. ఎవరూ పట్టించుకోవడం లేదు. అధికారులు మా సమస్యలు పరిష్కరించాలి. - ఈశ్వర్, విద్యార్థి

**నీళ్లు లేవు.. మూత్రశాలలు లేవు**



ఐటీఐలో కనీసం తాగడానికి నీళ్లు లేవు. మరుగుదొడ్లు మూత్రశాలలు లేక ఇబ్బంది పడుతున్నాం, అధికారులెవరూ పట్టించుకోవడం లేదు.

- కాశీరాం విద్యార్థి

**అధికారుల దృష్టికి తీసుకెళ్లాం**

ఐటీఐలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. పలుమార్లు సమస్యలను రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులకు విన్నవించాం.

- సుబ్బలక్ష్మి ప్రిన్సిపాల్

## క్లుప్తంగా

### వాటర్ ట్యాంక్ శుభ్రం చేయరూ?


ట్యాంక్ చుట్టూ పేరుకుపోయిన పాకురు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని గడి మోహల్‌లో గల మినీ వాటర్ ట్యాంక్ అస్తవ్యస్తంగా తయారైంది. నీటి సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన ట్యాంక్‌ను శుభ్రం చేయడం లేదని, దీంతో లోపల బయట పాకురు(నాచు)పేరుకుపోయిందని స్థానికులు వాపోతున్నారు. దోమలు, నీటిలో ఉండే కీటకాలు అందులో వృద్ధి చెందుతున్నాయని తెలిపారు. ప్రతి 6 నెలలకు ఓ సారి శుభ్రం చేయాల్సి ఉన్నా... పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి ట్యాంక్‌ను శుభ్రం చేయించాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

### 'అమరవాది'కి అవార్డు


అవార్డు అందుకుంటున్న రాజశేఖరశర్మ

వర్గల్(గజ్వేల్): జలాధర ఎడ్యుకేషనల్ టెక్నాలజీ (జేఈటీ) అకాడమీ ఇన్నోవేటివ్ టీచర్ అవార్డుకు వర్గల్ జెడ్పీ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు అమరవాది రాజశేఖరశర్మ ఎంపికయ్యారు. రాష్ట్రంలో 50 మంది ఉపాధ్యాయులను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. కాగా సోమవారం సికింద్రాబాద్ హరిహర కళాభవన్ వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథి ఆద్యా, అనీష్ ఆంథోని చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నట్లు అమరవాది తెలిపారు.

### సిద్ధారెడ్డికి బెస్ట్ పర్ఫార్మెన్స్..


అవార్డు అందుకున్న సిద్ధారెడ్డి

నారాయణఖేడ్: ట్రైన్ ద ట్రైనర్ కార్యక్రమంలో అద్భుత ప్రతిభ కనబర్చిన మనూరు మండల కేంద్రానికి చెందిన సిద్ధారెడ్డి ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సంస్థ వ్యవస్థాపకుడు గంప నాగేశ్వర్‌రావు చేతులమీదుగా బెస్ట్ పర్ఫార్మెన్స్ అవార్డును అందుకున్నాడు. హైదరాబాద్‌లోని హోటల్ కాకతీయలో లయన్ ట్రైన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. పబ్లిక్ స్పీకింగ్, లైఫ్, టెక్నికల్, పర్సనల్ డెవలప్‌మెంట్ స్కిల్స్ తదితర అంశాలపై శిక్షణనిచ్చారు. సిద్ధారెడ్డి పలు అంశాల్లో తన అద్భుత ప్రతిభను కనబర్చారు.

### కారు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

చిన్నశంకరంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు ఇలా... మండలంలోని శాలిపేట గ్రామానికి చెందిన బుస్స రమేశ్ బైక్‌పై చిన్నశంకరంపేట నుంచి గవ్వలపల్లి వైపు వెళుతున్నాడు. ఈ క్రమంలో మెదక్ వైపు నుంచి వస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో రమేశ్ కాలు విరగడంతో పాటు తలకు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అతడ్ని మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

### గుర్తుతెలియని వాహనం ఢీకొని..

- భర్త మృతి
- భార్య, కూతురికి తీవ్ర గాయాలు

పటాన్‌చెరు టౌన్: రోడ్డు ప్రమాదంలో భర్త మృతి చెందగా, భార్య, కూతురికి గాయాలయ్యాయి. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి వివరాల ప్రకారం... కంది మండలం.. ఎర్దనూరుకు చెందిన కృష్ణ(44) తన పల్సర్ బైక్‌పై భార్య కవిత, కూతురు శ్రీ వాణితో కలిసి రుద్రారం గ్రామ పరిధిలోని గణేశ్ గడ్డ దేవస్థానం నుండి ఇస్మాయిల్‌ఖాన్‌పేట్ వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో అటుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది.ఈ ఘటనలో కృష్ణ తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య, కూతురికి గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు.



# పత్తి రైతు కన్నీళ్లు

- దంచి కొడుతున్న వానలు
- నీరు గారిపోతున్న పత్తి
- దిగుబడి తగ్గే అవకాశం
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు

పుడమి తల్లిని నమ్ముకున్న రైతులకు కష్టాలు తప్పడం లేదు. ఒడిదుడుకులతో ప్రారంభమైన ఖరీఫ్‌సాగు ముందుకు సాగడం లేదు. అతివృష్టితో పత్తి పంట ఎదుగుదల నిలిచిపోయింది. జిల్లాలో 45 నుంచి 50 రోజులుగా పడుతున్న వర్షాల కారణంగా పత్తిలో పూత, కాత ఆశించిన స్థాయిలో రాకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వచ్చిన కాస్త పత్తి కాయలు పగిలి నీరు గారిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– మునిపల్లి(అందోల్)


ఇటీవల పత్తి చేనులో నిలిచిన వర్షం నీరు

వర్షాలతో పత్తి పంట పూర్తి స్థాయిలో దెబ్బతిందని, పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని జిల్లాలోని రైతులు వాపోతున్నారు. దెబ్బతిన్న పంటల వివరాలు రాసుకోవడానికి ఒక్క అధికారి రాలేదని మండి పడుతున్నారు. గత సంవత్సరం చెట్టుకు 20 నుంచి 40 కాయల వరకు ఉండేవని, ఈ సారి 10 నుంచి 20 కాయలు కూడా రాలేదని చెబుతున్నారు. కాస్తో కూస్తో ఉన్న పత్తి కాయలు కూడా వర్షం కారణంగా పగిలి పాడవుతున్నాయని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**పెరిగిన పెట్టుబడులు**

పత్తి విత్తనాలు నాటిన నుంచి 180 రోజుల లోపు గడువు ముగుస్తుందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. విత్తనాలు నాటిన నుంచి 120 రోజుల వరకు ఎదుగుదల, కాత, పూత, దశకు చేరుకుంటుంది. ఈ సమయంలో వివిధ రకాల ఎరువులు వేస్తుంటారు. సుమారు నాలుగు నుంచి ఐదు సార్లు మొక్క ఎదుగుదలకు, పురుగు నివారణకు మందులు పిచికారీ, ఎరువులను వేస్తారు. కానీ ఈ సారి సుమారు 50 రోజులుగా వర్షం పడుతుండటంతో మందుల వాడకం కూడా తగ్గించగా.. మరి కొందరు వర్షం తగ్గిన సమయంలో ఎరువులు వేశారు. వర్షం దాటికి వేసినవి కూడా పని చేయకుండా పోయాయని పలువురు రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. దీంతో పెట్టుబడులు పెరిగిపోగా పంట దిగుబడి మాత్రం గణనీయంగా తగ్గే పరిస్థితి వచ్చిందని, అప్పుల ఊబిలో కూరుకు పోయామని చెబుతున్నారు.

**దిగుబడులు తగ్గవచ్చు..**

ఎడతెరిపి లేకుండా పడుతున్న వర్షాల కారణంగా పత్తి దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఇప్పటికైనా వర్షాలు తగ్గితే కొంత వరకు ఆలస్యంగా వేసిన చేన్లలో కాత, పూత వచ్చే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

**పెట్టుబడి కూడా రాదు**



సొంత భూమితో పాటు మరో 20 ఎకరాలు ఇద్దరం కలిసి కౌలుకు తీసుకుని పత్తి వేశాం. విత్తనం నాటిన తర్వాత వర్షాలు పడకపోవడంతో తిరిగి మళ్లీ నాటాం. కాయ, పూత కాస్తున్న సమయంలో వర్షాలు పడటంతో ఆశలు ఆవిరయ్యాయి. దీంతో సుమారు రూ.5 లక్షల వరకు నష్టం వచ్చే అవకాశం ఉంది. నష్ట పరిహారం మంజూరు చేసి ప్రభుత్వం ఆదుకోవాలి.

– బగిలి బక్కన్న, రైతు, తాటిపల్లి

**నివేదిక పంపించాం**



వర్షాల కారణంగా దెబ్బతిన్న పత్తి పంట వివరాలను నమోదు చేసుకుని సంబంధిత అధికారులకు 10 రోజుల క్రితం నివేదిక పంపించాం. వర్షాలు తరచూ పడుతుండటంతో మరింత పత్తి నష్టం జరిగే అవకాశం ఉంది. పంట నష్టపరిహారం రాయడానికి వర్షం సమయం ఇవ్వడం లేదు.

– శివప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

## పాలపిట్టను బంధించడం నేరం

సంగారెడ్డి టౌన్: పాలపిట్టను పట్టుకోవడం, బంధించడం, ప్రదర్శించడం నేరమని సంగారెడ్డి జిల్లా అటవీశాఖ అధికారి శ్రీధర్ రావు తెలిపారు. ఎవరైనా వన్యప్రాణి సంరక్షణ చట్టాన్ని ఉల్లంఘిస్తే మూడేళ్ల జైలు శిక్షతోపాటు, లక్ష రూపాయల జరిమానా కూడా విధించే అవకాశం ఉందని పేర్కొన్నారు. నేరాన్ని ప్రోత్సహించిన వారు కూడా నేరస్తులుగా శిక్షించబడతారని తెలంగాణ, ఒడిశా, కర్ణాటక, రాష్ట్ర పక్షి అని.. ఇది ప్రమాదంలో పడిన పక్షి జాతి అన్నారు. సహజ ఆవరణ వ్యవస్థ నాశనం కావడం వల్ల పాలపిట్ట పక్షి మనుగడ, ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఒకప్పుడు ఎక్కడపడితే అక్కడ కనిపించే పాలపిట్ట ఇప్పుడు వెతికినా కనబడటం లేదన్నారు. దసరా పండుగ సందర్భంగా పాలపిట్టను బంధించి పంజరంలో ఉంచి ప్రదర్శిస్తున్నారని, ఇది అత్యంత అమానవీయమని, చట్ట విరుద్ధమని పేర్కొన్నారు.

## మైక్, ఎల్‌ఈడీ లైట్లు చోరీ

శివ్వంపేట(నర్సాపూర్): బతుకమ్మ ఉత్సవాల కోసం చెరువు కట్టపై ఏర్పాటు చేసిన లైట్లు, మైకులు చోరీ అయ్యాయి. ఈ ఘటన మండల కేంద్రమైన శివ్వంపేటలో చోటుచేసుకుంది. సోమవారం సద్దుల బతుకమ్మ వేడుకల సందర్భంగా పట్టణంలోని పెద్ద చెరువు కట్టపై ఆదివారం సాయంత్రం స్థానిక కాంగ్రెస్ నాయకుడు నవీన్‌గుప్తా ఎల్ఈడీ లైట్లు, మైకులు ఏర్పాటు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి రెండు మైకులతోపాటు, 10 ఎల్ఈడీ లైట్లు అపహరించారు. వాటి విలువ రూ.65 వేలు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## పేకాట స్థావరంపై దాడి

నర్సాపూర్ రూరల్: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి 11 మందిపై కేసు నమోదు చేశారు. ఎస్సై రంజిత్ రెడ్డి వివరాల ప్రకారం... రెడ్డిపల్లి సమీపంలోని అనన్య ఫామ్‌హౌస్‌లో పేకాట ఆడుతున్నట్లు ఆదివారం సమాచారం తెలిసింది. రాత్రి పోలీస్ సిబ్బందితో వెళ్లి దాడి చేయగా 11 మంది పేకాట ఆడుతున్నారు. ఐదు మంది లొంగిపోగా ఆరు మంది తప్పించుకున్నారు. రూ.3,800 నగదు, షిఫ్ట్ కారు, రెండు బైకులు, 6 మొబైల్స్, 55 గేమింగ్ కాయిన్స్, 104 ప్లేయింగ్ కార్డ్స్ సీజ్ చేసినట్లు తెలిపారు.

## దారి దోపిడీ ముఠా అరెస్ట్

పటాన్‌చెరు టౌన్: డబ్బుల కోసం దారి దోపిడీకి పాల్పడుతున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. కాగా పటాన్ చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో అదుపులోకి తీసుకున్నారు. వివరాలు ఇలా... సంగారెడ్డి జిల్లా మల్కాపూర్ శివారులో జాతీయ రహదారిపై కూకట్‌పల్లికి చెందిన విజయ్ సింగ్, ఎర్రగడ్డకు చెందిన ఈశ్వర్ సింగ్‌తో పాటు మైనర్.. సోమవారం తెల్లవారు జామున సదాశివపేట నుంచి హైదరాబాద్‌కు వస్తున్న లారీ డ్రైవర్ ఆసిఫ్‌పై కత్తితో దాడి చేసి డబ్బులు దోచుకుని పరారయ్యారు. ఈ విషయం తెలుసుకున్న పటాన్‌చెరు పోలీసులు ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డుపై తనిఖీలు చేపట్టి నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అయితే డ్రైవర్ ఆసిఫ్ మృతి చెందిన కారణంగా కేసును హైదరాబాద్ కొండాపూర్ పోలీస్‌స్టేషన్‌కు రిఫర్ చేయనున్నట్లు సమాచారం.

# హత్య కేసులో జీవిత ఖైదు

చేగుంట(తూప్రాన్): హత్య కేసులో కోర్టు నిందితుడికి జీవిత ఖైదు విధించింది. ఎస్ఐ చైతన్యకుమార్ రెడ్డి వివరాల ప్రకారం... మండలంలోని వడియారం గ్రామానికి చెందిన మత్రికింది నగేశ్ వల్లూర్ గ్రామానికి చెందిన తల్లీ, కూతురు యాదమ్మ, సంతోషలను 2022 ఏప్రిల్ 10న వడియారం శివారులోని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి చున్నీతో ఉరివేసి హత్య చేశాడు. అప్పటి రామాయంపేట సీఐ చంద్రశేఖర్‌రెడ్డి , ప్రస్తుత సీఐ వెంకట్‌రాజాగౌడ్ విచారణ కొనసాగించి సోమవారం సాక్ష్యాధారాలను కోర్టులో ప్రవేశపెట్టారు. పరిశీలించిన జిల్లా జడ్జి నీలిమ నిందితుడు నగేశ్‌కు జీవిత ఖైదుతో పాటు రూ.5ల జరిమానా విధించారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేశం, శిక్ష పడేలా కృషి చేసిన పోలీసులను ఎస్పీ శ్రీనివాస్‌రావు అభినందించారు.

**నమ్మించి మోసం చేసిన వ్యక్తికి ఏడాది..**

సిద్దిపేటరూరల్: ఇతరుల భూమి తన భూమి అని నమ్మించి మోసం చేసిన కేసులో కోర్టు నేరస్తునికి జైలు శిక్ష, జరిమానా విధించింది. ఎస్ఐ రాజేశ్ వివరాల మేరకు... 2015లో రాఘవాపూర్ మధిర గ్రామమైన బచ్చాయిపల్లికి చెందిన దుర్గం మల్లయ్య తన భూమిని సీతారాంపల్లికి చెందిన గుర్రం అంజిరెడ్డికి అమ్ముతానని రూ.2,95,000 అడ్వాన్స్‌గా తీసుకున్నాడు. 3 నెలల అనంతరం అంజిరెడ్డి మొత్తం డబ్బులు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు వెళ్లగా ఇప్పుడు చేయనన్నాడు. దీంతో అనుమానం వచ్చిన అంజిరెడ్డి భూమి గూర్చి ఆరా తీయగా అతని భూమి కాదని తెలిసింది. ఈ క్రమంలో డబ్బులు ఇవ్వాలని అడగగా బెదిరించాడు. అప్పటి ఎస్ఐ రాజేంద్ర ప్రసాద్ కేసు నమోదు చేసి నిందితుడ్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. సోమవారం వాదనలు విన్న ప్రిన్సిపల్ జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ సాధన నేరం రుజువైనందున మల్లయ్యకు ఒక సంవత్సరం జైలు శిక్ష, రూ. 2వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

**మరో కేసులో జరిమానా**

మునిపల్లి(అందోల్): మండలంలోని తాటిపల్లి గ్రామానికి చెందిన మేతరి అంబయ్య రూ. 5 వేలు, మేతరి కిశోర్‌లకు రూ.2 వేల జరిమాన విధిస్తూ స్పెషల్ మొబైల్ కోర్టు సోమవారం తీర్పునిచ్చింది. జరిమానా చెల్లించని యెడల రెండు నెలల జైలు శిక్షను విధించారు. వివరాలు... రూ.850 మందులు 2017లో ఫర్టిలైజర్ షాపులో ఉద్దెర తీసుకుని మేతరి అంబయ్య, మేతరి కిశోర్ ఇవ్వలేదు. దీంతో ఫర్టిలైజర్ యజమాని అజ్జపల్లి నరసింహా రెడ్డి బాకీ డబ్బులు అడిగాడు. దీంతో అతడిని కట్టెతో కొట్టి , నానా బుతులు తిట్టారు. అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేశారు. వాదనలు విన్న కోర్టు పై తీర్పునిచ్చిందని బుదేరా ఎస్ఐ రాజేశ్ నాయక్ తెలిపారు.

# ఆస్తి తగాదా.. తమ్ముడిని చంపిన అన్న

**సంగారెడ్డి జిల్లాలో ఘటన**


జయరాం

జహీరాబాద్: ఆస్తి పంపకాల గొడవలతో తమ్ముడిని అన్న చంపాడు. ఈ ఘటన సోమవారం తెల్లవారుజామున కోహీర్ మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... చింతలగట్టు గ్రామంలోని సొంత ఇంట్లో జయరాం ఒక్కడే నివాసం ఉంటున్నాడు. పెద్దన్న జయంత్ లింగంపల్లి గ్రామంలో నివాసం ఉంటుండగా, రెండో అన్న జైపాల్ గ్రామంలోని కమ్యూనిటీ భవనంలో ఉంటున్నాడు. సోమవారం ఉదయం చుట్టుపక్కల వారు జయరాం ఇంటి తలుపు తీయకపోవడంతో గమనించి జయంత్‌కు సమాచారం అందించారు. అతడు ఇంటికి వచ్చి చూడగా చిన్న తమ్ముడు జయరాం ఇంట్లో రక్తపు మడుగులో మరణించి ఉన్నాడు. ఇటీవల తండ్రి మొల్లయ్య ఆగస్టు 1న మరణించాడు. అప్పటి నుంచి జైపాల్ తన అన్న జయంత్, తమ్ముడు జయరాంతో తరచూ గొడవపడుతూ వస్తున్నాడు. ఉన్న రెండెకరాల పొలం, ఇంటిని తనకే ఇవ్వాలని, లేనిచో ఇద్దరినీ చంపేస్తానని బెదిరిస్తూ వస్తున్నాడు. ఈ విషయమై పలుమార్లు గొడవ కూడా జరిగింది. ఈ క్రమంలో ఆదివారం సైతం జైపాల్ తన తమ్ముడు జయరాంతో గొడవపడ్డాడు. దీంతో అతడు అన్న జయంత్‌కు ఫోన్‌చేసి సమాచారం అందించాడు. వెంటనే డయల్ 100కు కాల్ చేయడంతో పోలీసులు సైతం వెళ్లారు. అన్నదమ్ములు కలిసి మెలిసి ఉండాలని సర్దిచెప్పి వెళ్లారు. రాత్రి ఒంటరిగా నిద్రిస్తున్న జయరాంపై బలమైన ఆయుధంతో తలపై మోదడంతోనే మరణించి ఉంటాడని మృతుడి అన్న జయంత్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా ప్రస్తుతం జైపాల్ పరారీలో ఉన్నాడు.

# ఎల్లాపూర్ బ్రిడ్జిపై మొసలి

పాపన్నపేట(మెదక్): మండలంలోని ఎల్లాపూర్ బ్రిడ్జి రెయిలింగ్‌పై సోమవారం మొసలి కనిపించిందని స్థానికులు తెలిపారు. రెండు రోజులుగా మంజీర వరదలు బ్రిడ్జిని ముంచెత్తాయి.దీంతో వాహనాల రాకపోకలు నిలిపివేశారు. ఈ క్రమంలో సింగూర్ ప్రాజెక్టు నుంచి మొసలి పిల్ల కొట్టుకు వచ్చి బ్రిడ్జి రెయిలింగ్ పట్టుకొని ఉండవచ్చని భావిస్తున్నారు. సోమవారం బ్రిడ్జిపై రాక పోకలు ప్రారంభించడంతో అటుగా వెళ్తున్న ఎల్లాపూర్ వాసులు గమనించారు. దగ్గరగా వెళ్తుండగా నీటిలోకి దూకిందని చెప్పారు. ఈ విషయమై ఎస్సై శ్రీనివాస్‌గౌడ్‌ను వివరణ కోరగా ఈ ఘటన తమ దృష్టికి రాలేదన్నారు.


ఎల్లాపూర్ బ్రిడ్జి రెయిలింగ్‌పై ఉన్న మొసలి

## చెట్టును ఢీకొట్టిన కారు

బెజ్జంకి(సిద్దిపేట): కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. స్థానికుల కథనం ప్రకారం... కరీంనగర్‌కు చెందిన 8 మంది దుర్గామాత దీక్షాధారులు అదే జిల్లాలోని ఖాసీంపేటలోని మానసాదేవి ఆలయానికి సోమవారం వెళ్లారు. అమ్మవారి దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో మండలంలోని వడ్లూరు వద్ద కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. సమీపంలోనే పెద్ద వ్యవసాయ బావి ఉంది. చెట్టుకు ఢీకొని కారు ఆగడంతో పెను ప్రమాదం తప్పింది. భక్తులకు ఎవరికి గాయాలు కాలేదు.

# సివిల్స్ లక్ష్యంగా ముందుకు..

**గ్రూప్ –2లో డీటీగా ఎంపికైన గజ్వేల్ యువకుడు**


తాటి సాయికుమార్

గజ్వేల్‌రూరల్: సివిల్స్ కోచింగ్ తీసుకుంటూనే ఓ యువకుడు ఇటీవల విడుదలైన గ్రూప్–2లో డీటీగా ఎంపికయ్యాడు. గజ్వేల్ పట్టణంలోని అయ్యప్ప నగర్ కాలనీకి చెందిన తాటి మురళి–భాగ్యలక్ష్మి దంపతుల చిన్న కొడుకు సాయికుమార్ బీటెక్(మెకానికల్)లో ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సు పూర్తి చేశాడు. అనంతరం 2018 నుంచి సివిల్స్ లక్ష్యంగా హైదరాబాద్‌లోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో కోచింగ్ పొందుతున్నాడు. ఇటీవల వెలువడిన గ్రూప్ –2లో 14వ ర్యాంకుతో 418 మార్కులను సాధించి డిప్యూటీ తహసీల్దార్‌గా ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ సివిల్స్‌కు ఎంపికవడమే తన లక్ష్యమని తెలిపాడు. కాగా అతడిని కాలనీవాసులు అభినందించారు.

**ఏఎస్ఓగా ఎంపికైన సాయిప్రియ**


మినుకూరి సాయిప్రియ

కొండపాక(గజ్వేల్): చదువుకు పేదరికం అడ్డు కాదని నిరూపించింది ఓ పేదింటి విద్యార్థిని. ఇటీవల వెల్లడించిన గ్రూప్ –2 ఫలితాల్లో మినుకూరి సాయిప్రియ 826వ ర్యాంకు సాధించి జీఏడీలో ఏఎస్ఓగా ఉద్యోగ అర్హతను సాధించింది. మండలంలోని మర్పడ్గ గ్రామానికి చెందిన ఆమె ఇంటర్, బీటెక్, పీజీ విద్య నభ్యసించి గ్రూప్‌లో ఉద్యోగం పొందాలన్న లక్ష్యంతో ముందుకు సాగింది. ఈ క్రమంలోనే గ్రూప్ –2, గ్రూప్ –3, గ్రూప్ –4 పరీక్షలు రాసింది. ఇటీవల విడుదలైన గ్రూప్ –2 ఫలితాల్లో ఏఎస్ఓగా ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించింది. తల్లి స్వరూప అంగన్‌వాడీ టీచరుగా పని చేస్తుండగా, తండ్రి కిష్టయ్య ఆటో డ్రైవరుగా పని చేస్తున్నాడు.

**రైతు బిడ్డకు ఘన సన్మానం**


స్వామిని సన్మానిస్తున్న గ్రామస్తులు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని గంగాపూర్ గ్రామానికి చెందిన రైతు బిడ్డ నరిగే స్వామి ఇటీవల గ్రూప్ –1లో రాష్ట్ర స్థాయిలో 95వ ర్యాంకు సాధించి డీఎస్పీగా ఎంపికయ్యాడు. కాగా ఉద్యోగం సాధించిన తరువాత సోమవారం గ్రామానికి రావడంతో అతడికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. యూత్ సభ్యులతో పాటు గ్రామస్తులు సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ స్వామిని ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

# సింగూరుకు భారీ వరద

**11 గేట్లు ఎత్తి దిగువకు నీరు విడుదల**


సింగూరు డ్యామ్ నీటి పరవళ్లు

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టుకు వరద పోటెత్తింది. ఇప్పటికే 10 గేట్లు ఎత్తి నీటిని వదులుతున్న అధికారులు సోమవారం మరో గేట్‌ను ఎత్తి దిగువకు నీటిని వదిలారు. మహారాష్ట్ర, కర్ణాటక నుంచి భారీ వరదలు రావడంతో 11 గేట్లను రెండు మీటర్ల మేర ఎత్తి దిగువకు లక్షా 6,797 క్యూసెక్కుల నీటిని వదిలారు. ప్రాజెక్టులో 18 టీఎంసీల నీటిని నిల్వ ఉంచి మిగతా నీటిని వచ్చింది వచ్చినట్లే దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు నుంచి దిగువకు ఇన్‌ఫ్లో ఎక్కువ కావడంతో మంజీరా నది పరివాహకంలోని పంటలు మునిగి పోయాయి.

# సమస్యల వలయంలో తండాలు?


పంచరాయితండా




తెగిన చెరువు కట్ట, ఈ రోడ్డుపై ఎలా వెళ్లాలని చూపిస్తున్న తండా యువకులు

- తెగిన రోడ్డుతో రాకపోకలు బంద్
- దారి లేక.. అంబులెన్స్ రాలేక
- వైద్యం అందక ఆరు నెలల్లో నలుగురు మృతి
- కన్నెత్తి చూడని అధికారులు

అక్కన్నపేట(హుస్నాబాద్): తండాల్లో సమస్యలు తిష్ట వేశాయి. మండలంలోని హాతిరాం అంబనాయక్ తండావాసులు భయంతో వణికిపోతున్నారు. సకాలంలో వైద్యం అందక ఆరు నెలల్లో సుమారు నలుగురు యువకులు మృతి చెందారు. చెరువు కట్ట తెగడంతో తండాకు వచ్చే ప్రత్యామ్నాయ దారి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసరమైతే పరిస్థితి ఏంటని ఆవేదన చెందుతున్నారు. ఈ గ్రామ పరిధిలో పంచరాయితండా, ఏన్యతండాలు ఉండగా.. అందులో సుమారుగా 103 ఇండ్లు, 213 కుటుంబాలు ఉన్నాయి. దాదాపు 510వరకు ఓటర్లు ఉన్నారు.

**తండాకు రాకపోకలు బంద్**

ఈ తండాలన్నీ గండిపల్లి ప్రాజెక్టు అవతలి భాగంలో అనుకొని ఉంటాయి. దీంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ప్రాజెక్టులో భారీగా వరద నీరు చేరింది. అయితే తండా వాసులంతా ఇతర ప్రాంతాలకు వెళ్లాంటే ఈ ప్రాజెక్టు లోపలి చెరువు కట్ట మీదుగానే రాకపోకలు సాగించాలి. కాగా భారీ వర్షంతో పూర్తిగా చెరువు నిండి కట్ట తెగిపోయింది. దీంతో ప్రస్తుతం రాకపోకలు సాగించేందుకు వీలు లేకుండా పోయింది. ఈ క్రమంలో తండావాసులు బాహ్య ప్రపంచానికి దూరంగా బతకాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెగిన చోట మట్టి పోసి మరమ్మతులు చేయించాలని విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

**అత్యవసరమైతే అంతే?**

ఆ తండాలో ఎవరికైనా అనారోగ్య సమస్య వస్తే వైద్యం అందక నానా అవస్థలు పడుతున్నారు. చిన్న పాటి జ్వరం వచ్చినా సకాలంలో వైద్య సిబ్బంది ఎవరు రావట్లేదని తండావాసులు చెబుతున్నారు. దీంతో వైద్యం చేయించుకునేందుకు వెళ్లలేక లోలోపల బాధపడుతూ తీవ్ర అనారోగ్యానికి గురవుతూ మరణిస్తున్నారు. ఇటీవల ఇద్దరు యువకులకు సకాలంలో వైద్యం అందక అనారోగ్యంతో బాధపడుతూ మరణించారు. అలాగే పంచరాయితండా, అంబనాయక్‌తండా, ఏన్యా నాయక్ తండాలకు సరైన రోడ్డు మార్గం కూడా లేదు. దీంతో అంబులెన్స్ కూడా రావట్లేదని తండావాసులు చెబుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తెగిన రోడ్డుకు మరమ్మతులు చేయించాలని వేడుకుంటున్నారు.

**సదుపాయాలు లేవు..**



పేరుకే తండాను గ్రామ పంచాయతీగా మార్చారు తప్ప అధికారులు పట్టించుకోవడం లేదు. కనీస సదుపాయాలు లేవు. రోడ్డు తెగిపోవడంతో తండాకు రాకపోకలు బంద్ అయ్యాయి. దీంతో తండావాసులంతా బాహ్యప్రపంచానికి దూరంగా బతకాల్సిన దుస్థితి ఏర్పడింది. – భూక్య భిక్షపతినాయక్, పంచరాయితండా

**అంబులెన్స్ రావడానికి దారి లేదు**



అత్యవసరమైతే అంబులెన్స్ రావడానికి కూడా దారి లేదు. కంకర పోసి రోడ్డును వదిలేశారు. తండాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను అడిగితే స్పందించడం లేదు. రోజు భయంతో బతుకుతున్నాం.

–నూనావత్ మోహన్, పంచరాయితండా